సర్కారు స్కూళ్లలో చేర్పించడమే లక్ష్యం

శివ్వంపేట: చిన్నగొట్టిముక్ల పాఠశాలలో బడిబాట ప్రారంభిస్తున్న డీఈవో రాధాకిషన్

చేగుంట: కర్నాల్‌పల్లి పాఠశాలలో బడిబాటలో ప్రతిజ్ఞ చేస్తున్న హెచ్ఎం సత్యనారాయణ, కార్యదర్శి జగదీశ్

వెల్దుర్తి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీచర్లు

నిజాంపేట: నస్కల్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతున్న ఉపాధ్యాయులు

- ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య లభిస్తుంది
- తల్లిదండ్రులను కలిసి వివరిస్తున్న టీచర్లు
- గ్రామ గ్రామాన మొదలైన బడిబాట
- డీఈవో రాధాకిషన్

బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే తమ లక్ష్యమని డీఈవో రాధాకిషన్ అన్నారు. గురువారం శివ్వంపేట మండలంలోని చిన్నగొట్టిముక్ల ప్రభుత్వ పాఠశాలలో డీఈవో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామని, మండల, జిల్లా స్థాయిలోని ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశామని అన్నారు. అందరూ సమిష్టిగా పనిచేసి బడీడు పిల్లలను బడిలో చేర్పిస్తారన్నారు. ఎక్కడా డ్రాపౌట్ లేకుండా చూడడమే తమ లక్ష్యమన్నారు.

-న్యూస్ నెట్‌వర్క్, మెదక్, జూన్6

పాపన్నపేట్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

రామాయంపేట: కోనాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బడిబాట

కొల్చారంలో విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమంలో ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట: బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో బడిబాటలో ప్రచారం చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్

స్కూల్ యూనిఫాంలు సకాలంలో అందించాలి

కుట్టు కేంద్రాన్ని పరిశీస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌రూరల్, జూన్ 6: స్కూల్ యూనిఫాంలు నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో అందించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. హవేళీఘనపూర్ మండలంలోని ఫరీద్‌పూర్‌లో మహిళా సంఘల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్ యూనిఫాంల కుట్టు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించి, మాట్లాడారు. పాఠశాల ప్రారంభానికి ముందే యూనిఫాంలు అందించాలని ఆదేశించారు. తహసీల్దార్ నారాయణ తదితరులు ఉన్నారు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

మనోహరాబాద్‌లో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్

- డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరామ్

మనోహరాబాద్, జూన్ 6: వానకాలం మొదలవ్వడంతో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ అన్నారు. మనోహరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ఏఎన్‌సీలతో సమావేశాన్ని నిర్వహించారు. వానకాలం మొదలవ్వడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులను ముందుగానే అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఎన్‌సీలు గర్భిణులను గుర్తించి, ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ప్రసవం తర్వాత గృహ సందర్శన చేయాలన్నారు. ఇమ్యునైజేషన్ తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్‌కుమార్, తూప్రాన్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ అమీర్‌సింగ్, పీహెచ్‌సీ డీడీవో వికాస్, సీహెచ్‌వో బాలనర్సయ్య, వైష్ణవి, సాలుబాయ్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ఫర్టిలైజర్‌లో విత్తనాల శాంపిల్స్ పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి

చిలిపిచెడ్, జూన్ 6: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏఈవో బాల్‌రెడ్డి అన్నారు. గురువారం చిలిపిచెడ్ రైతు ఆగ్రో సేవా కేంద్రం, ఫర్టిలైజరును తనిఖీ చేసి విత్తనాల శాంపిల్స్ పరిశీలించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మకూడదని హెచ్చరించారు. అనుమతి లేని విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈవో భూపాల్, రమ్య, యాజమని శ్రీనివాస్ ఉన్నారు.

మొక్కలు సంరక్షించాలి

ఫైజాబాద్‌లో నర్సరీల్లో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆనంద్

చిలిపిచెడ్, జూన్ 6: మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో ఎంపీడీవో ఆనంద్ గురువారం సందర్శించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీ, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, క్రీడాప్రాంగణాన్ని పరిశీలించారు. ఆయనతో గ్రామ కార్యదర్శి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ రవి ఉన్నారు.

కళాశాల విద్యార్థుల వద్దకు అధ్యాపకులు

వెల్దుర్తి ప్రభుత్వ కళాశాలలో చేరాలని విద్యార్థులను కోరుతున్న అధ్యాపకులు

వెల్దుర్తి, జూన్ 6: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు కళాశాలల్లో చేరాలని అధ్యాపకులు కోరుతున్నారు. గురువారం వెల్దుర్తి ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కళాశాలలో కల్పిస్తున్న వసతులను విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించారు.

మట్టి అక్రమ రవాణాపై కొరడా

శివ్వంపేట, జూన్ 6: మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. శివ్వంపేట గ్రామ శివారులోని రాజన్నవాగు సమీపంలో అనుమతులు లేకుండా ఓ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి ఏదుల్లాపూర్ గ్రామ శివారులోని సింగయ్యచెరువు నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. సెహగల్ ఫౌండేషన్ వారు చెరువు కట్ట పనులు చేస్తున్నారు. ఆ పనులకు మొరం మట్టిని అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్‌చారి మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించారు. గ్రామాల్లో అక్రమంగా మట్టిని రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ఆయనతో ఆర్ఐ కిషన్ ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చండూర్ ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థులతో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

చిలిపిచెడ్, జూన్ 6: మండలంలోని చండూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం జరిగింది. ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఏడుపాయల దేవాలయం వద్ద నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ హన్మంత్, చండీప్రసాద్, నర్సింహులు, సత్యం, రామకృష్ణ, అందోల్ ఎంఈవో కృష్ణ, వెంకటరాజయ్య, విశ్వేశ్వర్, గంగాధర్, వీరేశం, శివకుమార్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అంగన్‌వాడీలు

పెద్దశంకరంపేటలో ఇంటింటికీ తిరుగుతున్న అంగన్‌వాడీ టీచర్ సరళ

చేగుంట: రెడ్డిపల్లి కాలనీలో అంగన్‌వాడీలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

చేగుంట, జూన్ 6: ఐదేండ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని అంగన్‌వాడి టీచర్లు సురేఖ, రమ అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మండలంలోని రెడ్డిపల్లి కాలనీ, వడియారం గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు.

పెద్దశంకరంపేట, జూన్ 6: రెండున్నరేండ్ల వయస్సు గల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించడానికి పెద్దశంకరంపేట లోని పూసలగల్లి అంగన్‌వాడీ కేంద్రం టీచర్ సరళ ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను పంపించాలని తల్లిదండ్రులను కోరారు.

అడ్మిషన్ల పేరుతో వ్యాపారం చేస్తున్న ప్రైవేటు సంస్థలు

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

నర్సాపూర్, జూన్ 6: అడ్మిషన్ల పేరుతో ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపారాలు చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం విమర్శించారు. గురువారం నర్సాపూర్‌లోని సీపీఎం కార్యాలయంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం మొదలు కాక ముందే ప్రైవేట్ స్కూల్స్, కార్పొరేట్ కాలేజీలు అడ్మిషన్ల పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించాయన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో పిల్లలను చేర్పించాలంటే రూ.లక్ష లు చెల్లించాల్సి వస్తున్నదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు ఉచిత విద్య సీట్లు కేటాయించాలని ఉన్నప్పటికీ ఎక్కడా అమలుకావడం లేదన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేవని, బాలికలకు టాయిలెట్స్ లేవని, నీటి వసతి లేదని దుయ్యబట్టారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నర్సమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజు, మల్లేశం, సంతోష్, వాసు, నాయకులు దాసు, శేఖర్, రాములు, సుకూర్, శంకరయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ నాయకుడి పుట్టిన రోజు

పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంటున్న బీఆర్ఎస్ నాయకుడు వంటెద్దు బాల్‌రెడ్డి

నర్సాపూర్, జూన్ 6: బీఆర్ఎస్ నాయకుడు వంటెద్దు బాల్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు కేక్ కట్ చేయించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, కౌన్సిలర్లు రాంచందర్, యాదగిరి, సురేశ్, నాయకులు ఆంజనేయులుగౌడ్, దావూద్, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, సిబ్బంది విష్ణు, మురళి తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుడికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

వెల్దుర్తి, జూన్ 6: వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కుమార్ 2007-08లో పదో తరగతి చదువుకున్నాడు. అతడి తల్లి లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుమార్ కుటుంబానికి చిన్ననాటి పదో తరగతి స్నేహితులు శ్రీకాంత్, సంపత్, నరేశ్, మహేశ్, కృష్ణ, పలువురితో కలిసి ఆర్థిక సాయాన్ని పోగు చేసి గురువారం కుమార్‌కు అందజేశారు.

అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవు

మాట్లాడుతున్న ఈడీఎం సందీప్

- మెదక్ జిల్లా ఈడీఎం సందీప్

మెదక్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని అన్ని ఆన్‌లైన్ కేంద్రాల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఈడీఎం సందీప్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా మీసేవ, ఆధార్ కేంద్రాలు, ఓఎస్ఎస్ (వన్ స్టాప్ సర్వీస్), సీఎస్‌సీ (కామన్ సర్వీస్ కేంద్రం) నిర్వాహకులతో రాష్ట్ర ఈఎస్‌డీ కమిషనర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీఎం మాట్లాడుతూ ఆన్‌లైన్ కేంద్రాల్లో తప్పనిసరిగా సిటిజన్ చార్టర్లు, అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు రాయలన్నారు. ఆన్‌లైన్ కేంద్రాల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్నారు. ఆన్‌లైన్ కేంద్రాల్లో నూతనంగా టీఎస్ స్థానంలో టీజీ రసీదులు అందించాలన్నారు. అన్ని రకాల రిజిస్టర్లను సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఉన్నతాధికారులు తనిఖీకి వచ్చినపుడు అన్ని రకాల రిజిస్టర్లను సరైన పద్ధతిలో నమోదు చేసి చూపించాలన్నారు. రిజిస్టర్ నమోదులో పారదర్శకత పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. ఆన్‌లైన్ కేంద్రాల్లో అదనపు రాబడి కోసం కేంద్ర సర్వీసులు ఉపయోగించుకోవాలి కానీ అదనపు చార్జీలు వసూలు చేస్తే తక్షణమే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆన్‌లైన్ కేంద్రాల్లోని విధి విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టీజీటీస్ డీఎం శశికాంత్, సీఎస్ సీడీ ఎం.రాజు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గ్రీన్ చాంపియన్ అవార్డు

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్‌కు గ్రీన్ అవార్డును అందజేస్తున్న వాణీప్రసాద్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 6: పర్యావరణ పరిరక్షణలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. పర్యావరణ రక్షణకు కృషి చేసిన వివిధ స్వచ్ఛంద, ప్రభుత్వ, విద్యా సంస్థల సేవలకు ఏటా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి గ్రీన్ అవార్డులు ప్రకటిస్తుంది. ఇందులో భాగంగా 2024 సంవత్సరానికి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రీన్ అవార్డుకు ఎంపికైంది. హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హు స్సేన్‌కు అడవులు, పర్యావరణ శాఖ ప్రిన్సిప ల్ సెక్రెటరీ వాణీప్రసాద్ అవార్డు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామాయంపేట, జూన్ 6: మండలంలోని శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ పెంట్యానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని దామరచెర్వు, రామాయంపేట, గొల్పర్తి, అక్కన్నపేట, లక్ష్మాపూర్, కాట్రియాల, కోనాపూర్, పర్వతాపూర్, ఝన్సీలింగాపూర్ గ్రామాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, జూన్ 6: మండలంలోని సూరారం, ధర్పల్లి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సతీశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాగీర్థిపల్లి, సూరారం, ధర్పల్లి గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు రైతులు సహకరించాలని ఆయన కోరారు.

పలు ఆలయాల్లో ఘనంగా శనీశ్వర పూజలు

కౌడిపల్లి, జూన్ 6: వెల్మకన్నలో శని అమావాస్య సందర్భంగా స్వామివారికి తైలాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన తదితర పూజలను గురువారం నిర్వహించారు. పూజారులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అమావాశ్య సందర్భంగా భక్తులు పూజల్లో భారీగా పాల్గొన్నారు. జిల్లాలోని వెల్మకన్నలో 9 ఫీట్ల ఎత్తైన శనైశ్చరుడి విగ్రహం ఉండడంతో ప్రతి శనివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తుంటారని పూజారులు తెలిపారు.

మల్లన్న ఆలయంలో

మెదక్‌రూరల్, జూన్ 6: మండలంలోని మంభోజిపల్లి కొయ్యగుట్టపై కొలువైన మల్లన్న ఆలయంలో గురువారం పూజారి మల్లన్న అమావాస్య పూజలు చేశారు. శనీశ్వర పూజలు, భజనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు

పూజలు చేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

శివ్వంపేట, జూన్ 12: మండలంలోని గంగాయిపల్లి గ్రామ ఓం పాజిల్‌నగర్ అప్పగారి ఆశ్రమంలో అర్ధ సంవత్సర ఆరాధనోత్సవాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అప్పగారి పాదరక్షక కాపరి నసీరొద్దిన్ చిష్తి నర్సింలు అప్పగారు, నాయబ్‌దాస్ చిష్తి ఆధ్వర్యంలో జెండా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ తీర్థ, ప్రసాద వితరణ, అన్నదానం చేశారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

కౌడిపల్లి, జూన్6: బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మాసాగర్ చెరువు కట్టపై గురువారం జరిగింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బూరుగడ్డకు చెందిన తాటి శంకర్ (42) గురువారం కౌడిపల్లి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. బైక్‌పై కౌడిపల్లికి వస్తున్న క్రమంలో ధర్మాసాగర్ చెరువు కట్టపై బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకుని గాయాలతో ఉన్న శంకర్‌ను 108లో నర్సాపూర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓల్డేజ్ హోమ్‌లో అన్నదానం

నర్సాపూర్, జూన్ 6: మున్సిపల్ పరిధిలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో పట్టణానికి చెందిన చంద్రప్ప జ్ఞాపకార్థం ఆ కుటుంబీకురాలు పద్మ ధనలక్ష్మి గురువారం అన్నదానం చేశారు. దాతలు ముందుకొచ్చి ఈ హోమ్‌లోని వృద్ధులకు ఆర్థిక సాయం చేయాలని కోరారు.

ఆలయంలో చోరీకి యత్నం

నర్సాపూర్, జూన్ 6: నర్సాపూర్‌లోని హిందూవాహిని ధర్మశాలలో ఉన్న వీరభద్ర స్వామి ఆలయంలో గురువారం ఓ దుండగుడు చోరీకి యత్నించాడు. పోలీసులు, ఆలయ పూజారి మనోజ్ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలోకి ఓ యువకుడు చొరబడి జలతార శివపార్వతుల పంచలోహ విగ్రహాలు, సామగ్రిని దొంగలించడానికి ప్రయత్నం చేశాడు. యువకుడు విగ్రహం దొంగలించి గోడ దూకే ప్రయత్నం చేస్తుండగా పక్కనే ఉన్న పరమేశ్వరీ ఆలయంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న లక్ష్మయ్య ఇది చూసి సదరు వ్యక్తిని నిలదీశాడు. దీంతో విగ్రహాన్ని, సామగ్రిని అక్కడే వదిలేసి పారిపోయాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

వెల్దుర్తి, జూన్ 6: మాసాయిపేట మండలంలోని శ్రీనివాసనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. 38 నుంచి 40 ఏండ్ల వయసు గల పురుషుడిని బుధవారం రాత్రి రైలు ఢీకొనడంతో శరీరం ముక్కలుగా ఎగిరిపడింది. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా, లేక ప్రమాదం జరిగిందా, మృతిచెందిన వ్యక్తి ఎవరు అనే వివరాలు తెలియరాలేదని ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కౌడిపల్లి, జూన్6: బతుకుదెరువు కోసం వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో గురువారం జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా చేకువకా గ్రామానికి చెందిన పచ్చిక రాము తన భార్య హేమలతతో రెండేండ్ల క్రితం బతుకుదెరువు కోసం ముట్రాజ్‌పల్లికి వచ్చి ఓ రైతుకు చెందిన టమాట పంటలో కూలీకి కుదిరాడు. ఇక్కడే పని చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకెళ్లి సాయంత్రం వరకు రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది. అదే రోజు సాయంత్రం నర్సాపురం మమత రాము భార్య హేమలతకు ఫోన్ చేసి, తన అక్క కూతురు స్రవంతి వ్యవసాయ క్షేత్రంలో కనిపించడం లేదని చెప్పింది. తన భర్త స్రవంతిని తీసుకొని వెళ్లిపోయినట్లు హేమలత అనుమానం వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.